# దేవాదుల ట్రయల్ రన్ సక్సెస్..
# అన్నదాతల్లో వెల్లివిరిసిన ఆనందం

- దేవన్నపేట పంప్ హౌజ్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ కు గోదావరి జలాలు
- ఒక మోటార్ ఆన్ చేసి నీటి విడుదల
- పది రోజుల నిరీక్షణకు తెర..60 వేల ఎకరాలకు నీరు
- అన్నదాతల్లో ఆనందం

-3 లో





# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 28 మార్చి 2025 | పేజీలు 8


# ఏసిబి వలలో డి.పోచంపల్లి... విద్యుత్ ఏఈ సురేందర్ రెడ్డి

**రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఉన్నపళంగా దొరికిపోయాడు..**



సూరారం కాలనీలో అక్రమ నిర్మాణానికి, ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్.. రోడ్డుపైనే..(ఫైల్ ఫోటో)



ఏసిబికి చిక్కిన డి.పోచంపల్లి విద్యుత్ ఏఈ సురేందర్ రెడ్డి..

- దుండిగల్ మండలం డి.పోచంపల్లి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్ రెడ్డి..
- అవినీతికి ప్రతిరూపం.. రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి దొరికిన ఏఈ..
- అవినీతి ఏఈ పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలో అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌లు కోకొల్లలు..
- ఉన్నతాధికారులు కూడా ఏఈ సురేందర్ రెడ్డి ఏం చెబితే అదే వింటారని వినికిడి..
- డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో అక్రమంగా విద్యుత్ మీటర్లు..
- సూరారం కాలనీ బస్సురోడ్డులో ముడుపులు పుచ్చుకుని అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌లు సాంక్షన్..

ఓ అవినీతి చేప పాపం పండి ఏసిబి అధికారులకు చిక్కింది.. ఓ వ్యక్తికి 11 కేవి లైను మార్చేందుకు లంచం డిమాండ్ చేయడంతో కథ అడ్డం తిరిగింది.. నిజానికి సంబంధిత ఏఈపై గతంలోనే అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ..! ఇప్పటికీ చిక్కాడు.. అక్రమ నిర్మాణాలకు "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" లేకపోయినా "పై అధికారులను" మెప్పించి- ఒప్పించి "ట్రాన్స్‌ఫార్మర్‌లు" సాంక్షన్ చేయడానికి సురేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తాడని ఆరోపణలు ఉన్నాయి.. పత్రికల్లో వార్తలు వచ్చినా..! ఉన్నతాధికారులు అండ ఉండటంతో పెద్దగా పట్టించుకోడని "సూరారం కాలనీలోని అక్రమంగా మంజూరు చేసిన ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లతో రుజువైంది.. ఎంతైనా తీసుకున్న దానికి న్యాయం చేయడంలో ఏఈ సారును మించిన నిజాయితీ పరుడు లేరు అనుకుంటారు..! కానీ సారు రూటే సెపరేటు.. సూరారం కాలనీలో 40 ఫీట్ల రోడ్డులో గమనిస్తే..! ఏఈ సురేందర్ రెడ్డి సారు అక్రమంగా సాంక్షన్ చేసిన "ట్రాన్స్‌ఫార్మర్‌లు" రోడ్డుపైనే స్వాగతం పలుకుతాయి..

అదేంటో డీఈ, ఏడీఈ కూడా సమర్ధిస్తారే కానీ చర్యలు తీసుకోరు.. ఇక విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఎందుకు విధుల్లో ఉన్నారో కూడా తెలియదు.. ఇంతమంది ఉన్నతాధికారుల అండ ఉన్నంత వరకు ఏఈ సురేందర్ రెడ్డి లాంటి అవినీతి అధికారుల ఆటలు కొనసాగుతూనే ఉంటాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 27:

-2లో

# అందాల పోటీలను ఆపేయండి!

- అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వాలన్న కేటీఆర్
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్న కేటీఆర్
- గురుకుల పాఠశాలల్లో విషాహారంతో బాధపడుతున్నారన్న కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో నిర్వహించనున్న అందాల పోటీలను ఆపేసి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. విద్య కోసం బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని చెప్పారని, కానీ ఏడున్నర శాతం మాత్రమే ప్రకటించారని తెలిపారు. విద్యా భరోసా కార్డులు ఇస్తామని చెప్పారని, పిల్లల ఫీజులు కట్టాల్సిన అవసరం లేదని

-3 లో

# ఆర్థిక శాఖలో జరిగినవన్నీ తవ్వుతున్నా

- భారాస నేతల భవనాలకు అద్దెలు పెంచి గురుకులాలు పెట్టారు
- బడ్జెట్ పద్దులపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం
- బడ్జెట్‌కు సభ ఆమోదం, నిరవధిక వాయిదా



హైదరాబాద్ పెన్ పవర్:: రాష్ట్ర ఆర్థిక శాఖలో గత పదేళ్లలో జరిగిన విషయాలన్నీ తాను తవ్వుతున్నానని, వాటి లెక్కలన్నీ సభ ముందు పెడతానని భారాస నేతలు ఆందోళన చెందుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శాసనసభలో గురువారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ... "భారాస నాయకుల భవనాలకు అడ్డగోలుగా

-3 లో

# మహాత్మాగాంధీ యూనివర్సిటీలో భారీ అగ్నిప్రమాదం..
## దవానలంలా వ్యాపిస్తున్న మంటలు..




హైదరాబాద్ పెన్ పవర్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గురువారం (మార్చి 27) సాయంత్రం మొదలైన మంటలు ఇప్పటికీ

-3 లో

# ఏసిబి వలలో డి.పోచంపల్లి... విద్యుత్ ఏఈ సురేందర్ రెడ్డి

## రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఉన్నపళంగా దొరికిపోయాడు..




ఏసిబికి చిక్కిన డి.పోచంపల్లి విద్యుత్ ఏఈ సురేందర్ రెడ్డి..

- దుండిగల్ మండలం డి.పోచంపల్లి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్ రెడ్డి..
- అవినీతికి ప్రతిరూపం.. రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి దొరికిన ఏఈ..
- అవినీతి ఏఈ పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలో అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌లు కోకొల్లలు..
- ఉన్నతాధికారులు కూడా ఏఈ సురేందర్ రెడ్డి ఏం చెబితే అదే వింటారని వినికిడి..
- డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో అక్రమంగా విద్యుత్ మీటర్లు..
- సూరారం కాలనీ బస్సురోడ్డులో ముడుపులు పుచ్చుకుని అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌లు సాంక్షన్..



సూరారం కాలనీలో అక్రమ నిర్మాణానికి, ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్.. రోడ్డుపైనే..(ఫైల్ ఫోటో)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో విద్యుత్ అధికారుల ఆగడాలు అంతా ఇంతా కాదు.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు రాత్రికి రాత్రే విద్యుత్ మీటర్లు సాంక్షన్ అక్రమార్జనకు నిదర్శనం.. విద్యుత్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సైట్ వెరిఫికేషన్ లేకుండానే రైట్ రైట్ అంటూ మంజూరు చేస్తున్న విషయం నియోజకవర్గం ప్రజలకు విదితమే.. గాజులరామారం సర్వే నెం.307, 329, 342, 79, 49, అండ్ దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నెం.120లోనూ, పలు ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలకు సగం క్లియరెన్స్ విద్యుత్ అధికారులదే..! 59 జీవోలకు క్రమబద్ధీకరణలో విద్యుత్ మీటర్లనే పరిగణలోకి తీసుకుని అక్రమాలు సక్రమం అవుతున్నాయి.. ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లకు ప్రతిపాదనలు, సైట్ వెరిఫికేషన్‌లతో ఇష్టానుసారంగా నొక్కడంలో ఏఈ అండ్ లైన్ ఇన్‌స్పెక్టర్‌ల చేతివాటమే ప్రధానం.. విజిలెన్స్ అధికారులు వేతనాల కోసమే విధుల నిర్వహిస్తున్నారని ఆరోపణలు.. ఏసిబి అధికారులు కుత్బుల్లాపూర్ విద్యుత్ అధికారులపై నిఘా పెంచితే మరికొందరు వలలో చిక్కే అవకాశం లేకపోలేదు..



డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో షెడ్డుకు ఏఈ సురేందర్ రెడ్డి విద్యుత్ మీటర్.. (ఫైల్ ఫోటో)

## రూ.30 వేలు లంచం తీసుకుని.. దొరికి పోయిన ఏఈ..

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటుతో రోజుకో చోట దాడులు నిర్వహిస్తూ.. అధికారులపై వేటు వేస్తున్నప్పటికీ..! కొందరు అవినీతి అధికారుల తీరు మారడం లేదు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం డి.పోచంపల్లి సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సురేందర్ రెడ్డి లంచం తీసుకుంటూ, ఏసిబి అధికారులకు దొరికి పోయాడు.. వివరాల్లోకి వెళ్ళితే.. జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహిస్తున్న ఏఈ సురేందర్ రెడ్డి..
ప్రగతినగర్‌కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి సంబంధించి 11 కేవి లైన్ షిఫ్టింగ్ విషయంలో రూ.30 వేలు తీసుకుంటూ ఏసిబి అధికారులకు ఉన్నపళంగా పట్టుబడ్డాడు.. బాధితుడు ప్రసాద్ ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో ఏఈ సురేందర్ రెడ్డిపై, వారు నిఘా పెట్టారు.. గురువారం కేబులు షిఫ్టింగ్ పనులు ముగించిన అనంతరం.. ఏఈ సురేందర్ రెడ్డి రూ.30 వేలు తీసుకుంటుండగా..! అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ పి.శ్రీధర్ ఆధ్వర్యంలో డి.పోచంపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో దాడులు నిర్వహించిన ఎసీబీ అధికారులు బాధితుడు రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా ఏఈని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు

ఓ అవినీతి చేప పాపం పండి ఏసిబి అధికారులకు చిక్కింది.. ఓ వ్యక్తికి 11 కేవి లైను మార్చేందుకు లంచం డిమాండ్ చేయడంతో కథ అడ్డం తిరిగింది.. నిజానికి సంబంధిత ఏఈపై గతంలోనే అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ..! ఇప్పటికీ చిక్కాడు.. అక్రమ నిర్మాణాలకు "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" లేకపోయినా "పై అధికారులను" మెప్పించి- ఒప్పించి "ట్రాన్స్‌ఫార్మర్‌లు" సాంక్షన్ చేయడానికి సురేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తాడని ఆరోపణలు ఉన్నాయి.. పత్రికల్లో వార్తలు వచ్చినా..! ఉన్నతాధికారులు అండ ఉండటంతో పెద్దగా పట్టించుకోడని "సూరారం కాలనీలోని అక్రమంగా మంజూరు చేసిన ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లతో రుజువైంది.. ఎంతైనా తీసుకున్న దానికి న్యాయం చేయడంలో ఏఈ సారును మించిన నిజాయితీ పరుడు లేరు అనుకుంటారు..! కానీ సారు రూటే సెపరేటు.. సూరారం కాలనీలో 40 ఫీట్ల రోడ్డులో గమనిస్తే..! ఏఈ సురేందర్ రెడ్డి సారు అక్రమంగా సాంక్షన్ చేసిన "ట్రాన్స్‌ఫార్మర్‌లు" రోడ్డుపైనే స్వాగతం పలుకుతాయి.. అదేంటో డీఈ, ఏడీఈ కూడా సమర్థిస్తారే కానీ చర్యలు తీసుకోరు.. ఇక విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఎందుకు విధుల్లో ఉన్నారో కూడా తెలియదు.. ఇంతమంది ఉన్నతాధికారుల అండ ఉన్నంత వరకు ఏఈ సురేందర్ రెడ్డి లాంటి అవినీతి అధికారుల ఆటలు కొనసాగుతూనే ఉంటాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 27:**

# ఆర్థిక శాఖలో జరిగినవన్నీ తప్పుతున్నా

- మొదటి పేజీ తరువాయి

అద్దెలు ఖరారు చేసి వాటిలో గురుకులాలను పెట్టారు. ఏ జిల్లాలో, ఏ గురుకులం, ఏ నేత భవనంలో ఉందనే వివరాలన్నీ తెప్పించాం. భవనాల అద్దెలను ఏటా పెంచారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను మాత్రం పెంచలేదు. పైగా అద్దెలను కూడా పెండింగ్‌లో పెట్టారు. మేం వచ్చాక వాటిలో రూ.126 కోట్లు విడుదల చేశాం. దీర్ఘకాలిక అప్పుల పేరిట గత ప్రభుత్వం ఎక్కడ పడితే అక్కడ అప్పులు తెచ్చి... వాటి ఫలాలను అనుభవించింది. రుణాలను తిరిగి తీర్చాల్సిన సమయం వచ్చే సరికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ అప్పులను క్రమంగా తీర్చుకుంటూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. వారి హయాంలో రూ.1,59,940 కోట్ల విలువైన పనులను మంజూరు చేశారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన రూ.40 వేల కోట్ల బిల్లులకు టోకెన్ నంబర్లు సిద్ధం చేసి ఉంచారు. మేం అన్ని శాఖల పెండింగు బిల్లులనూ వెసులుబాటును బట్టి చెల్లిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంజూరు చేసిన పనుల బిల్లుల విలువ రూ.ఐదారు వందల కోట్లకు మించి లేదు. భారాస వారి పనులకు సంబంధించినవే పెండింగులో ఉన్నాయి. ఇప్పుడు తమవారి కోసం తాపత్రయపడుతూ భారాస సభ్యులు మాపై నిందలేస్తున్నారు. మేం మీకంటే ఎక్కువ విమర్శలు చేయగలం. ఉద్యోగుల పింఛన్ బకాయిలు, పీఎఫ్ వంటివన్నీ కలిపి రూ.25 వేల కోట్ల బకాయిలుంటే రూ.16 వేల కోట్లను ఇప్పటికే చెల్లించాం. భారాస పదేళ్ల పాలనలో బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రూ.70,474 కోట్లు ఖర్చు పెట్టకపోవడంతో ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. మేం అధికారంలోకి వచ్చాక వేతనాలకు రూ.80,106 కోట్లు, అప్పులు, వడ్డీలకు రూ.88,564 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.1,32,9096 కోట్లు ఖర్చు పెట్టాం.

**సభ అంటే భయం ఉండాలి...**

సభ్యులకు సభ అంటే కొంత భయం ఉండాలి. ఆచితూచి మాట్లాడాలి. అప్పుడే నిజమైన చర్చలు జరుగుతాయి. ఏదిపడితే అది మాట్లాడుతూ సభను తప్పుదారి పట్టించకూడదు. నాంపల్లి అగ్ని ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలను ఆదుకుంటాం. ఫలక్‌నుమాలో భూమి మార్పిడి సీఎం పరిశీలనలో ఉంది. రుణమాఫీకి రూ.8 వేల కోట్లే ఇచ్చామని హరీశ్‌రావు అంటున్నారు. కానీ, ప్రతీ గ్రామంలో ఏ రైతుకు ఎంత మాఫీ అయిందో చెబుతూ డిస్‌ప్లే బోర్డులు పెట్టాలని చెప్పాం. గజ్వేల్‌లో రూ.238 కోట్ల రుణమాఫీ చేశాం. గ్రామాలవారీ రుణమాఫీ జరిగిన రైతుల పేర్లను ఎమ్మెల్యేలకు ఇస్తాం. ద్రవ్య వినిమయ బిల్లు(బడ్జెట్)ను ఆమోదించాలి" అని భట్టి కోరారు. అనంతరం బడ్జెట్‌ను సభ ఆమోదించినట్లు సభాపతి ప్రసాద్‌కుమార్ ప్రకటించి నిరవధిక వాయిదా వేశారు.

**11 రోజులు.. 97 గంటలు**

శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగిశాయి. మొత్తం 11 రోజులు.. 97.32 గంటల పాటు సభ జరిగింది. 146 ప్రసంగాలు జరగ్గా.. మూడు తీర్మానాలు చేశారు. 12 బిల్లులను శాసనసభ ఆమోదించింది. ఈ వివరాలను సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. కాంగ్రెస్‌కు 65 మంది, భారాసకు 38, భాజపాకు 8, ఎంఐఎంకు ఏడుగురు, సీపీఐకి ఒకరు చొప్పున మొత్తం 119 మంది శాసనసభ్యులు ఉన్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. "రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చర్చలు అర్థవంతంగా జరిగాయి. తమ నియోజకవర్గాల్లోని సమస్యలను గౌరవ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. అందరికీ నా ధన్యవాదాలు" అని సభాపతి పేర్కొన్నారు.

# దేవాదుల ట్రయల్ రన్ సక్సెస్.. అన్నదాతల్లో వెల్లివిరిసిన ఆనందం

హైదరాబాద్ పెన్ పవర్: అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. దేవాదుల ప్రాజెక్టు థర్డ్ ఫేజ్?లో భాగంగా దేవన్నపేట వద్ద నిర్మించిన పంపు హౌజ్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్?కు ఆఫీసర్లు నిర్వహించిన ట్రయల్ రన్ సక్సెస్ అయింది. దేవన్నపేట పంప్ హౌజ్?లోని మూడు మోటార్లలో ఒక దానిని రాత్రి 2.30 గంటల సుమారులో ఆన్ చేయగా.. 3.25 గంటల ప్రాంతంలో నీళ్లు ధర్మసాగర్ రిజర్వాయర్?కు చేరాయి.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారంలోని గోదావరి నదిపై నిర్మించిన జువ్వాడి చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం థర్డ్ ఫేజ్ కింద రామప్ప చెరువు నుంచి దేవన్నపేట వద్ద పంప్ హౌజ్ వరకు రూ.1,494 కోట్లతో 49.06 కిలోమీటర్ల మేర టన్నెల్ నిర్మాణం పూర్తికాగా ఇక్కడి నుంచి ఒక మోటార్ ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో జనగామ జిల్లాలోని 60 వేల ఎకరాలకు ఇవాల్టి నుంచి సాగునీరు అందనుండటంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**పది రోజుల నిరీక్షణ**

ఈ నెల 18న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా దేవాదుల పంప్ హౌజ్ మోటార్?ను ఆన్ చేసి, సాగునీరు విడుదల చేయాలని భావించారు. కానీ స్కాడా సిస్టంలో తలెత్తిన సమస్య వల్ల అవాంతరాలు ఏర్పడ్డాయి. పంప్ హౌజ్?లో ఏర్పాటు చేసినవి ఆస్ట్రియాకు చెందిన ఆండ్రిట్జ్ కంపెనీ మోటార్లు కాగా ఆ కంపెనీకి చెందిన ముగ్గురు ఇంజినీర్లు అదే రోజు సాయంత్రం దేవన్నపేట పంప్ హౌజ్?కు చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు తీవ్రంగా శ్రమించారు.

అయినా ఫలితం లేకపోవడంతో ఎటుచేసి నీళ్లు విడుదల చేశాకే తిరుగు ప్రయాణమవ్వాలనుకున్న రాష్ట్ర మంత్రులు అర్ధరాత్రి వరకు ఎదురు చూసి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆండ్రిట్జ్ కంపెనీ ఇంజినీర్లు స్కాడా లోపాలను సవరించగా.. ఇరిగేషన్ ఆఫీసర్లు రెండు రోజుల కిందట ట్రయల్ రన్ కు ఏర్పాట్లు చేశారు. కానీ పంప్ హౌజ్ లోని గేట్ వాల్వ్ లాక్ అవడంతో మరోసారి అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్ నుంచి మరో ఇద్దరు నిపుణులను తీసుకొచ్చి పనులు చేయించారు.

**అర్ధరాత్రి దాటాక గంగమ్మ పరవళ్లు**

దేవన్నపేట పంప్ హౌజ్ వద్ద బుధవారం సాయంత్రం వరకు పనులన్నీ పూర్తి కాగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ పవర్ సప్లై సిస్టంలో సమస్య కారణంగా మూడుసార్లు మోటార్ ట్రిప్ అయ్యింది. దీంతో నిన్న రాత్రి ఎంత లేటైనా నీటిని విడుదల చేయాలన్న తపనతో ఆండ్రిట్జ్ ఇంజినీర్లతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ అడ్వైజర్ పెంటారెడ్డి, హనుమకొండ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారాం నాయక్, ఇతర ఆఫీసర్ల ఆధ్వర్యంలో పనులు చేపట్టి ఆ సమస్యనూ పరిష్కరించారు.

అనంతరం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో మోటార్ ను ఆన్ చేయగా.. దేవన్నపేట పంప్ హౌజ్ నుంచి దాదాపు ఆరున్నర కిలోమీటర్ల పైపులైన్ ద్వారా నీళ్లు ధర్మసాగర్ రిజర్వాయర్ కు చేరుకున్నాయి. అధికారులు తెల్లందాక అక్కడే ఉండి పనులు చేయించగా.. దాదాపు పది రోజుల నిరీక్షణకు తెరపడటంతో ఆఫీసర్లు, ఇంజినీర్లలో సంతోషం వ్యక్తమైంది.

**60 వేల ఎకరాలకు సాగునీరు**

దేవన్నపేట పంప్ హౌజ్ లో 31 మెగా వాట్స్ సామర్థ్యం కలిగిన ఆస్ట్రియాకు చెందిన ఆండ్రిట్జ్ కంపెనీ మూడు మోటార్లు ఏర్పాటు చేయగా.. అందులో ఒక దానిని ఆన్ చేసి 584 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ట్రయల్ సక్సెస్ కావడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ కు నీళ్లు చేరుతుండగా.. ఇక్కడి నుంచి నష్కల్, అక్కడి నుంచి పాలకుర్తి ట్యాంక్ కు నీటిని విడుదల చేస్తున్నారు.

దీంతో ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి జనగామ జిల్లాలో స్టేషన్ ఘన్ పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లోని 60 వేల ఎకరాలకుపైగా సాగు నీరందుతోంది. అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా దేవాదుల థర్డ్ ఫేజ్ లో చేపట్టిన పనులన్నీ పూర్తయితే మొత్తంగా 5.22 లక్షల ఎకరాలకు సాగు నీరందనుంది.

## అందాల పోటీలను ఆపేయండి!

- మొదటి పేజీ తరువాయి

చెప్పారని కానీ, ఏదీ నెరవేరలేదని విమర్శించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు విషాహారంతో బాధపడుతున్నారని విమర్శించారు. తాము ఫీజు రీయింబర్సుమెంట్స్ చెల్లించామని, మరో రూ. 8 వేల కోట్లు ఉన్నాయని వాటిని చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అందాల పోటీల కోసం ఖర్చు పెట్టే బదులు విద్యార్థినులకు స్కూటీల కోసం ఖర్చు పెట్టాలని సూచించారు. రూ. 500 కోట్లతో కొందరికైనా స్కూటీలు వస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2 లక్షల ఉద్యోగాల గురించి చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 11 వేల ఉద్యోగాలే అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు మాత్రమే ఇచ్చిందని అన్నారు. గ్రూపు-2 పోస్టులు పెంచుతామని చెప్పి పెంచలేదని విమర్శించారు.

## మహాత్మాగాంధీ యూనివర్సిటీలో భారీ అగ్నిప్రమాదం.. దవానలంలా వ్యాపిస్తున్న మంటలు..

- మొదటి పేజీ తరువాయి

చల్లారడం లేదు. మంటలు ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు అంటుకుంటూ దవానలంలా వ్యాపిస్తున్నాయి. యూనివర్సిటీ చుట్టూ మంటలు వ్యాపించడంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు విద్యార్థులు.ఈ ప్రమాదంలో సుమారు100 ఎకరాల వరకు చెట్లు కాలిపోయాయి. మంటలు భారీ ఎత్తున ఎడసిపడుతున్నాయి. యూనిర్సిటీ మొత్తాన్ని పొగ కమ్మేసింది. దీంతో భయాందోళన పరిస్థితులు యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో నెలకొన్నాయి. యూనివర్సిటీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంతో గత మూడు గంటలుగా హాస్టల్లో కరెంటు లేదు. దీంతో విద్యార్థులు చీకట్లోనే మగ్గుతున్నారు. దవిద్యార్థులు, సిబ్బంది పోలీసులకు ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని.. ఫైర్ ఇంజన్ తో మంటలు అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## డా.బీఆర్ అంబేద్కర్ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు: ఎమ్మెల్యే వివేక్

హైదరాబాద్ పెన్ పవర్: డా.బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టం వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కమలాపూర్ గ్రామంలో 12 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం (మార్చి 27) ఎమ్మెల్యే వివేక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమలాపూర్?లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ గ్రామం మొత్తం పండగ వాతావరణాన్ని తలపిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి కాకా వెంకటస్వామి నిత్యం ప్రజల గురించి ఆలోచించారని.. అంబేద్కర్ అనుచరుడిగా హైదరాబాద్?లో అంబేద్కర్ కాలేజ్ స్థాపించారని తెలిపారు. ఎంతో మంది పేదలకు కాకా ఇండ్ల జాగాలు ఇచ్చారని గుర్తు చేశారు. సమాజంలో పైకి ఎదిగిన వారు.. మన చుట్టు ఉన్న వారికి సహాయం చేయాలని.. అంబేద్కర్ దారిలో నడవాలని సూచించారు. అంబేద్కర్ కేవలం రిజర్వేషన్లు మాత్రమే ఇవ్వలేదని.. దాదాపు అన్నివర్గాల్లోని పేదలకు, స్త్రీలకు ఉపయోగపడే బిల్లులు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనలతోనే రిజర్వ్ బ్యాంక్ ఇండియా స్థాపించారని అన్నారు. దళితులంత నిరంతరం కష్టపడటం నేర్చుకోవాలని.. బాగా చదవాలని సూచించారు. పిల్లలకు క్రమశిక్షణ, మంచి విద్య అందించాలని.. మద్యం సేవించడం బంద్ చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ పిలుపునిచ్చారు.

# రేవంత్ రెడ్డికి స్టీల్ క్యారియర్ అందించిన కొండా సురేఖ

- ప్రజాప్రతినిధులకు జూట్ బ్యాగు, కాపర్ బాటిల్, స్టీల్ క్యారియర్ అందజేత
- ఎవరూ ప్లాస్టిక్ వాడవద్దని విజ్ఞప్తి
- ప్లాస్టిక్ వ్యర్థాలతో అంతా కలుషితమవుతోందని ఆందోళన



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ స్టీల్ క్యారియర్ అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'సే నో టు ప్లాస్టిక్' అనే నినాదంతో తెలంగాణ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆమె జూట్ బ్యాగు, పుస్తకం, కాపర్ బాటిల్, స్టీల్ క్యారియర్, బట్ట సంచులను పంపిణీ చేశారు.

తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడవద్దని, పర్యావరణాన్ని నష్టపరచొద్దని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా 'ప్లాస్టిక్ వినియోగం – ప్రమాద ఘంటికలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) మెంబర్ సెక్రటరీ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం 5 లక్షల కోట్ల కంటే ఎక్కువ ప్లాస్టిక్ సంచులు వాడుతున్నారని, వాటిని పడేస్తున్నారని అన్నారు. ప్రతి నిమిషం 10 లక్షల వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు 630 కోట్ల టన్నులు అని అన్నారు. ఇందులో 79 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలు, నీటి వనరులలో పారేస్తున్నారని తెలిపారు.

12 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిపై వదిలేస్తున్నారని, 9 శాతం మాత్రమే రీసైకిల్ చేయబడుతోందని వివరించారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్వలు, సరస్సులు, నదీ ప్రవాహాలను అడ్డుకుంటున్నాయని అన్నారు. ఇవి మొక్కలు, వృక్షాలు, జంతు జలాన్ని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వలన క్యాన్సర్ కారక విషపూరిత వాయువులు వెలువడుతున్నాయని పేర్కొన్నారు.

# రామ్ చరణ్ సమున్నత స్థాయిలో నిలవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** వెండి తెరపై కథానాయకుడిగా తనదైన శైలిని ఆవిష్కరిస్తున్న రామ్ చరణ్ కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామ్ చరణ్ కు మరిన్ని విజయాలు, ఆనందోత్సాహాలు ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తొలి చిత్రం నుంచీ ప్రతి అడుగులో ప్రేక్షకులను మెప్పిస్తూనే... ఎప్పటికప్పుడు నవ్యరీతిలో పాత్రలను ఎంచుకొంటున్నారు. మరో వైపు రామ్ చరణ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆయనలోని సామాజిక బాధ్యతను తెలియచేస్తున్నాయి. నటనలో విభిన్న శైలి చూపడం, పెద్దలపట్ల గౌరవ భావన, ఆధ్యాత్మిక చింతన, సమాజం పట్ల బాధ్యత... రామ్ చరణ్ ఎదుగుదలకు కచ్చితంగా దోహదం చేస్తాయి. సమున్నత స్థాయిలో నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# ఈ తేదీల్లో హైదరాబాద్ ఫ్లై ఓవర్స్‌పై టూ వీలర్స్ నిషేధం..



**హైదరాబాద్ పెన్ పవర్:**టూ వీలర్ వాహనదారులకు అలర్ట్. హైదరాబాద్ లో రెండు రోజల పాటు కొన్ని ఫ్లై ఓవర్స్ పై నిషేధం విధించారు ట్రాఫిక్ పోలీసులు. షాబ్–ఇ–ఖాదిర్ (Shab-e-Qadr) సందర్భంగా ఫ్లై ఓవర్స్ పై నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్చి 27, 28న.. రెండు రోజుల పాటు బైక్ లకు పోలీసులు సూచించిన పలు ఫ్లై ఓవర్లపైకి అనుమతి లేదని గురువారం (మార్చి 27) ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి 10 గంటల తర్వాత బైక్స్ ఈ ఫ్లై ఓవర్లు ఎక్కితే చర్యలు తప్పవని హెచ్చరించారు. షాబ్–ఇ–ఖాదిర్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు.

**టూ వీలర్స్ నిషేధం అమలులో ఉండే ఫ్లై ఓవర్లు:**

బహదూర్ పుర ఫ్లై ఓవర్ – జూపార్క్ 2వ గేట్ నుంచి దేవీ బాఘ్ వరకు

చంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్ – హషామాబాద్ నయారా పెట్రోల్ బంక్ నుంచి ఫూల్ బాఘ్ DLRL వరకు

డా.ఏపీజే అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్ – పిసల్ బండ నుంచి లక్ష్మీరెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ వరకు

డా.మన్మోహన్ సింగ్ ఎక్స్ ప్రెస్ ఫ్లై ఓవర్ – ఆరాంఘర్ నుంచి జూపార్క్ ఫ్లై ఓవర్ వరకు

హైదరాబాద్ టూ వీలర్ బైకర్స్ నిషేధాజ్ఞలను దృష్టిలో ఉంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఏదైనా అంతరాయం కలిగితే 9010203626 అనే నంబర్ కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

ఇటీవల ఇస్లామిక్ పండుగల సందర్భంగా ఫ్లై ఓవర్లపై యాక్సిడెంట్స్ ఎక్కువయ్యాయి. షాబ్–ఇ–మెరాజ్ సందర్భంగా మాజ్(14), ఇమ్రాన్(16), అహ్మద్(14) అనే మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఘోర ప్రమాదాలకు గురయ్యారు. ఈ సందర్భంగా తమ పిల్లలకు చర్యలపై పోలీసులు దృష్టి సారించాలని, ప్రేయర్ చేసుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చి వారిని స్టంట్స్ కు దూరంగా ఉండేలా చూడాలని పోలీసులను కోరారు కొందరు మత పెద్దలు.

# హైదరాబాద్‌లో పుట్టిన మీకు తెలుగు ఎందుకు రాదు?: అక్బరుద్దీన్ ఒవైసీకి ఆకునూరి మురళి కౌంటర్

- సీతక్కకు హిందీ, ఇంగ్లీష్ రాదు, నాకు తెలుగు రాదన్న అక్బరుద్దీన్ ఒవైసీ
- మంత్రికి హిందీ రాదు సరే... నీకు తెలుగు ఎందుకు రాదని ఆకునూరి మురళి ప్రశ్న
- అక్బరుద్దీన్‌కు సామాజిక బాధ్యత ఉండాలని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి సీతక్కకు ఇంగ్లీష్, హిందీ రాదని, తనకు తెలుగు రాదని వ్యాఖ్యానించిన మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీకి తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. మంత్రికి హిందీ రాదు సరే, హైదరాబాద్‌లోనే పుట్టిన మీకు తెలుగు ఎందుకు రాదని ప్రశ్నించారు. "మంత్రిగారికి హిందీ రాదు సరే, మరి నీకు తెలుగు ఎందుకు రాదు బాబు? హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగినవు కదా! రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు మాట్లాడే మొదటి అధికార భాషా తెలుగు నేర్చుకోవాలనే సామాజిక బాధ్యత నీకు ఉండాలి కదా" అంటూ చురక అంటించారు. అసెంబ్లీలో అందరు సభ్యులు, మంత్రులు తెలుగులోనే మాట్లాడుతున్నప్పుడు మీకు ఏం అర్థమవుతుందని ప్రశ్నించారు. ఏదో ఒకటి అసెంబ్లీలో ప్రసంగం దంచేసి వెళ్లిపోతే సరిపోతుందా అని విమర్శించారు. తెలుగు రాకపోతే రాష్ట్రంలోని సమస్యలు మీకెలా అర్థమవుతాయని ప్రశ్నించారు. హిందీ, ఇంగ్లీష్ రాకపోతే నీకు అంత చిన్నచూపా? పొగరు కాకపోతే! అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్



కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం' అంటూ మంత్రులు మాట్లాడటం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆలోచన లేకుండా భారీ ప్రాజెక్టును 'కూలేశ్వరం' అని సంబోధించవద్దని కేటీఆర్ హితవు పలికారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతున్న ముఖ్యమంత్రే, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్?కు నీరు తెస్తానని పేర్కొనడం విడ్డూరంగా ఉందని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కూలిపోతే కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, బస్వాపూర్ ప్రాజెక్టులు కూడా ఉండవని ఆయన స్పష్టం చేశారు.రైతులను పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా గోదావరి జలాలను వినియోగించే అవకాశం ఉందని ఆయన తేల్చి చెప్పారు. కమీషన్లు, ఫామ్ హౌస్‌ల కోసమే రీడిజైన్ల పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆయన ఆరోపించారు.కాళేశ్వరం పేరుతో ఎవరెన్ని అక్రమాలు చేశారో నిరూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇంకా ఎంత కాలం అబద్ధాలు చెబుతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో నిర్మించిన ప్రాజెక్టులతోనే సాగునీరు అందించవచ్చని, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు అవసరం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఈ ప్రాజెక్టులపై నిజనిర్ధారణ కమిటీ వేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై ఏకసభ్య కమిషన్ విచారణ జరుపుతోందని తెలిపారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదికను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సభ్యుల ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సత్సంబంధాలు ఉండాలని రేవంత్ రెడ్డి చెబుతున్నారు.. మేము అలాగే ఉన్నాం

- కేంద్రంతో సఖ్యతతో ఉన్నప్పటికీ తెలంగాణకు ఏమీ రాలేదన్న కేటీఆర్
- తెలంగాణ బాగుండాలన్నదే తమ సంకల్పమన్న కేటీఆర్
- కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీత




కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాము కూడా కేంద్రంతో సఖ్యతగానే ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయినప్పటికీ తెలంగాణకు ఏమీ రాలేదని ఆయన విమర్శించారు.రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ బాగుండాలన్నదే తమ సంకల్పమని, తెలంగాణకు మేలు జరగాలి, రాష్ట్ర ప్రజలు బాగుండాలని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ప్రతి పనిలో గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని, మరి కేంద్ర ప్రభుత్వం తీరుపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభలో కేటీఆర్ మాట్లాడుతూ, పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు.తెలంగాణ పథకాలను కేంద్రం అనుసరిస్తోందని కేటీఆర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదని విమర్శలు చేస్తున్నారని, తమకు వచ్చింది గుండు సున్నానే కావొచ్చు... మరి కేంద్ర బడ్జెట్‌లో గుండు సున్నా వస్తే ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని అన్నారు. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు తాము కూడా మద్దతిస్తామని అన్నారు.తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. కుంభమేళాకు నిధులిచ్చిన కేంద్రం సమ్మక్క సారలమ్మ జాతరకు ఎందుకివ్వడం లేదని నిలదీశారు.

# రమేష్ రెడ్డిపై టీడీపీ చర్యలు తీసుకోవాలి

మాజీ ఏం సి చైర్మన్ అల్వాల్ రమేష్ రెడ్డి పై టిడిపి అధిష్టానం చర్యలు తీసుకోకపోతే 48 గంటల్లో రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు హెచ్చరించారు. కొలికెపూడి మాట్లాడిన వార్తే మాట్లాడకపోయినా వార్తే. గిరిజన మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన రమేష్ రెడ్డి పై ఎటువంటి చర్యలు టిడిపి అధిష్టానం ఎందుకు తీసుకోలేదని శ్రీనివాసరావు సూటిగా ప్రశ్నించారు. లోన్ కోసం ఒక అమ్మాయి ఫోన్ చేస్తే సమాజం సిగ్గుపడేలా అసభ్యకరంగా మాట్లాడారు. విజయవాడ ఎంపీ చిన్ని ఉన్నా రని రమేష్ రెడ్డి చెప్పుకుంటున్నాడు. చిన్ని ఆఫీసులోని కిషోర్ కి నాలుగు ట్రాక్టర్లు, 50 లక్షలు ఇచ్చాను రమేష్ రెడ్డి అంటున్నా డు. నేను ఎంక్వయిరీ చేస్తే ఒక టాక్టర్ ఇచ్చిన మాట వాస్తవమే నని తేలింది. తిరువూరు నియోజకవర్గం లో మొదటిసారి అడుగు పెట్టినప్పుడు నన్ను ఆశీర్వదించింది ఈ గిరిజన గ్రామాలే. ఒక గిరిజన మహిళతో ఇంత అసభ్యంగా మాట్లాడిన రమేష్ రెడ్డి నాకు కనబడితే గుభ పలగొడతాను. గోపాలపురంలో మట్టి తోలే నాయకుడు పేరు రాసి దమ్ము ఉందా. ఇకనైనా ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని పార్టీ నుండి వెంటనే సస్పెండ్ చేయాలని అయన అన్నారు.

# అసెంబ్లీలో కాగ్ రిపోర్ట్ ప్రవేశపెట్టిన

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సర్కారు ఇవాళ గురువారం కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది.2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించగా దానిని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు.ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు కాగా, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా చెప్పారు.

# 68ఉద్యోగుల పిఎఫ్ ఈఎస్ఐ సకాలంలో చెల్లించాలి

## వారధి సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్:**వారధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ క్రమం సకాలంలో చెల్లించాలని సొసైటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కరీంనగర్ వారధి సొసైటీ పదవ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగింది.సొసైటీ చైర్ పర్సన్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వారధి సొసైటీ 2015 లో ప్రారంభమైందని అన్నారు. ఇప్పటివరకు 85 వేల 129 మంది ఉపాధి, ఉచిత శిక్షణ కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. వారధి సొసైటీ ఆరు జిల్లాల పరిధిలో సేవలు అందిస్తోందని అన్నారు. సొసైటీలో ఉన్న ఉద్యోగులందరికీ సకాలంలో ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ చెల్లించాలని సూచించారు. 2 వేల 997 మంది ఈ సంస్థ ద్వారా ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది 186 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రజల అవసరాల కోసం వారధి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు.

ఈ సందర్భంగా వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు సంస్థ వార్షిక ఆదాయవ్యయాలను సభ్యులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు, సంస్థ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం..పీసీసీ చీఫ్ మహేష్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన జర్మన్ పారిశ్రామిక వేత్త స్టీఫెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తాటి ఈత చెట్ల నుండి వచ్చే కల్లుతో వైన్ ఆరక్ తదితర అనుబంధ పదార్థాలు తయారు చేసే పరిశ్రమను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క లను కలిసారు.గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రొఫెసర్ జానయ్య కాంబోడియా స్టడీ టూర్ వెళ్ళినపుడు అక్కడ ఈ పరిశ్రమ ఎంతో ఆర్థికంగా ఉపాధి కల్పిస్తుండడంతో తెలంగాణ లో కూడా పరిశ్రమ ఏర్పాటు కు స్టీఫెన్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తి మేరకు తెలంగాణ లో కల్లు ఆధారిత పరిశ్రమల్లో భాగంగా తాటి ఈత చెట్ల నుండి వైన్, ఆరక్ తయారు చేసే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియజేశారు.

అసెంబ్లీ ప్రాంగణములో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లతో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన స్టీఫెన్ ఈ పరిశ్రమ తెలంగాణాలో ఏర్పాటు చేయడం వల్ల గీత కార్మికులు వృత్తి పరమైన ఆర్థికాభివృద్ధిని పొందడమే కాకుండా, వాల్యూ అడిషన్, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అయన వివరించారు. తెలంగాణ కల్లు యూరప్ కి ఎగుమతి స్థానికంగా కల్లు దుకాణాల ఏర్పాటు. గీత కార్మికులకు కనీసం ఆదాయం పెంపుదల ఇతర రాష్ట్రాలు మరియు ఇతర దేశాలకు మార్కెటింగ్ విస్తరణ తో పాటు రీసెర్చ్ మరియు డెవలప్మెంట్ విభాగం ఏర్పాటు చేయడం, తాటి ఈత మొక్కలు త్వరగా పెరిగి అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల తయారుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు.

సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జర్మన్ ప్రతినిధి స్టీఫెన్, పారిశ్రామిక వేత్త రోహిత్ పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ కు ఘన నివాళి అర్పించిన క్రిస్టియన్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాస్టర్ ప్రవీణ్ కు క్రిష్టియన్లు ఘననివాళులర్పించారు. పాస్టర్ ప్రవీణ్ మృతి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తుంది. ప్రమాద వశాత్తు జరిగినట్లుగా, రోడ్డు ప్రమాదంలోనే ఆయన తీవ్రంగా గాయపడి మరణించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో స్పష్టం అయింది. పోలీసులు కుట్ర కోణం ఏమీ లేదంటున్నారు. మరోవైపు క్రైస్తవ సంఘాలు ప్రముఖులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం విచారణ కు ఆదేశించినట్లు ప్రకటించింది.

# బట్టతలతో బాధపడుతున్న డాక్టర్ సూసైడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** 34 ఏళ్లు.. ఉన్నతంగా చదువుకున్నాడు.. వైద్య వృతి.. సమాజంలో మంచి పేరు కూడా ఉంది.. కానీ పెళ్లి కావడంలేదు.. బట్ట తల ఉందని అమ్మాయిలు పెళ్లి చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు.ఈ క్రమంలోనే ఓ సంబంధం కుదిరింది.. ఇటీవల నిశ్చితార్థం కూడా జరిగింది.. కానీ.. బట్టతల ఉందని.. ఇతర కారణాలను ఆ అమ్మాయి చెప్పి.. పెళ్లిని ఆపింది.. దీంతో కుదిరిన సంబంధం కూడా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆ యువ డాక్టర్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు.. చివరకు ట్రైన్ కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు.. ఈ విషాదకర ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వివాహం కావడంలేదన్న మనస్తాపంతో ఓ బస్తీ దవాఖానాలో వైద్యుడిగా సేవలందిస్తున్న డాక్టర్ పురోహిత్ కిషోర్ (34) అనే వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ప్రకాష్‌మాల్ దంపతులకు ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు పురోహిత్ కిషోర్ ఎంబీబీఎస్ డాక్టర్‌గా అల్వాల్ బస్తీ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు.. ఈ క్రమంలోనే.. కిషోర్‌కు కొన్నిరోజుల కిందట ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. అంతా బాగానే ఉందనుకున్న క్రమంలోనే.. కిషోర్ కు బట్టతల ఉండడం, ఇతర కారణాల వల్ల ఆ అమ్మాయి అతనితో పెళ్లికి నిరాకరించింది.. దీంతో నిశ్చితార్థం అర్ధాంతరంగా రద్దయింది.

ఆ తర్వాత కిషోర్ కు వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలను చూస్తున్నా కుదరడం లేదు.. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కిషోర్ బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై ఇంట్లో నుంచి బటయకు వెళ్లాడు.. ఆ తర్వాత బొల్లారం వెళ్లి అక్కడ రైల్వేస్టేషన్ వద్ద వాహనాన్ని ఉంచాడు.. అనంతరం సమీపంలోని క్యావలరీ బ్యారక్ రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకున్న కిషోర్.. నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న హుజూర్‌సాహిబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు..గుర్తించిన రైలు లోకో పైలెట్.. జీఆర్పీ పోలీసులకు సమాచారాన్ని అందించారు.. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డు చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. కిషోర్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి..

# తుగ్గలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా రాచపాటి రామాంజినమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక

**హైదరాబాద్ పెన్ పవర్:** తుగ్గలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా శభాష్ పురం ఎంపీటీసీ రాచపాటి రామాంజినమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం రోజున మండల కేంద్రమైన దుగ్గలను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు జరిగిన తుగ్గలి ఎంపీపీ ఉప ఎన్నికలలో 16 మంది ఎంపీటీసీలు హాజరయ్యారు.ఎన్నికల అధికారి అజయ్ కుమార్ ఆదేశాల మేరకు తుగ్గలి ఎంపీపీ అభ్యర్థి రాచపాటి రామాంజినమ్మను ఎద్దులదొడ్డి ఎంపీటీసీ మల్లికార్జున రెడ్డి ఎంపిక చేయగా, జొన్నగిరి ఎంపీటీసీ-1 ఎర్ర నాగప్ప బలపరిచారు.అనంతరం హాజరైన తుగ్గలి మండలానికి సంబంధించిన ఎంపిటిసిలు తుగ్గలి ఎంపీపీగా రామాంజినమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం హెచ్ఎన్ఎస్ ప్రాజెక్టు భూసేకరణ అధికారి,ఎన్నికల ప్రొసీడింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్ తుగ్గలి మండల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా రాచపాటి రామాంజినమ్మ ను ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తూ,ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.అనంతరం తుగ్గలి మండల వైఎస్సార్సీపీ పార్టీ కు చెందిన ఎంపీటీసీలు ఎంపీపీగా ఎన్నికైన రామాంజినమ్మ ను పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఎంపీపీ రామాంజినమ్మ,మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం నుండి పాదయాత్రగా వెళ్లి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.జొన్నగిరి మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుంత రఘు ఎంపీపీ రామాంజినమ్మను,మాజీ సర్పంచ్ శభాష్ పురం హనుమంతు ను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామాంజనమ్మ, శభాష్ పురం హనుమంతు లు మాట్లాడుతూ తనను ఎంపీపీగా ఎన్నుకున్నందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కు, మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవి కు, తుగ్గలి మండలం ఎంపీటీసీ లకు, మండల వైఎస్సార్సీపీ నాయకులకు వారు కృతజ్ఞతలు










తెలియజేశారు. వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం,జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి,మాజీ జడ్పిటిసి జగన్నాథ రెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి,తుగ్గలి శ్రీనివాసరెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి,తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి,పాటిల్ సుధాకర్ రెడ్డి, రాంపల్లి నాగభూషణం రెడ్డి,కో ఆప్షన్ మెంబర్ చాంద్ భాషా,శభాష్ పురం సర్పంచ్ గౌరవ సలహాదారులు రవి,గుంత రఘు, మండల ప్రధాన కార్యదర్శి చెన్నంపల్లి రంజాన్,తదితర మండల వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్,తుగ్గలి ఎస్సై కృష్ణమూర్తి,మద్దికేర ఎస్సై విజయ్ కుమార్ నాయక్ లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆ కులస్తులకు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలి

**జగిత్యాల పెన్ పవర్::** బుడబుక్కల,పిచ్చకుంట్ల, దొమ్మరి ,వీరభద్రీయ,వంశ రాజ్ కులాల వారు వారి కులాల మార్పు కోసం పెట్టుకున్న వినతిని ఆమోదించాలని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ను కోరారు.గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గాంధీ నగర్ లో దొమ్మర కులస్తుల సంఘ భవనంలో బీసీ సంక్షేమజిల్లా అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలోబీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ కు ఆయా కులాల మార్పు ఆమోదించాలని టీబీసీ జేఏసీ తరపున వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్,తిరుమలగిరి సురేందర్,బాల లక్ష్మి లను టీ బీసీ జేఏసీ తరపున ఘనంగా సన్మానించారు.అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ దొమ్మర కులస్తుల స్థితి గతులతో పాటు పిచ్చకుంట్ల,బుడబుక్కల,వంశ రాజ్ ,వీరభద్రీయ, దొమ్మర, కులాల వారు విద్యాలయాలు,ఉద్యోగ స్థలాల్లో ,కార్యాలయాల్లో పిలుచుకోవడానికి ఇబ్బందులు పడుతున్న దయనీయ పరిస్థితులను వివరిస్తూ వారి కులాల పేర్లు మార్చాలని తమ అసోసియేషన్ అభిప్రాయంను బీసీ కమిషన్ కు హరి ఆశోక్ కుమార్ వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోషియో,ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించడం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలో మున్నూరు కాపు కులాన్ని బీసీ డి గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపు కు మార్చాలని తగు స్థితిగతుల ను పేర్కొంటూ మరో వినతిపత్రం బీసీ కమిషన్ చైర్మన్ కు అందజేశారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం పట్ల హరి ఆశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలుపుతూ చట్టబద్ధతకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.సి.హన్మంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దిండిగాల విఠల్,జగిత్యాల నియోజకవర్గ బీసీ జేఏసీ అధ్యక్షుడు పుప్పాల నర్సింగరావు,జిల్లా మహిళా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి,పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ,తదితరులు పాల్గొన్నారు.

# భారీ సంఖ్యలో వీసా అపాయింట్‌మెంట్లు రద్దు

**భారతీయులకు షాకిచ్చిన భారత్ లోని అమెరికా దౌత్య కార్యాలయం**

**హైదరాబాద్ పెన్ పవర్:**
భారత్ లోని అమెరికా దౌత్య కార్యాలయం భారతీయులకు షాకిచ్చింది. తాజాగా భారీ సంఖ్యలో వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో భారీ లోపాన్ని గుర్తించినట్లు దౌత్య కార్యాలయం వెల్లడించింది. ఈ కారణంగా ఏకంగా 2 వేల యూఎస్ వీసీ దరఖాస్తులను రద్దు చేసినట్లు ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో వీటిని రద్దు చేసినట్లు తెలిపింది. ఈ అపాయింట్‌మెంట్లు అన్నీ 'బాట్స్' (ఃనీబిబ) ద్వారా వచ్చినట్లు గుర్తించినట్లు పేర్కొంది.'బాట్స్ చేసిన 2 వేల వీసా అపాయింట్‌మెంట్లను భారత్‌లోని కాన్సులర్ టీం రద్దు చేస్తోంది. మా షెడ్యూలింగ్ విధానాలను ప్రభావితం చేసే ఏజెంట్లు, ఫిక్సర్‌లను ఏమాత్రం సహించేది లేదు. ఈ అపాయింట్‌మెంట్లను రద్దు చేయడంతో పాటు.. ఆయా సంబంధిత ఖాతాలకు షెడ్యూలింగ్ అధికారాలను కూడా సస్పెండ్ చేస్తున్నాం' అని దౌత్య కార్యాలయం తన ఎక్స్ పోస్టులో పేర్కొంది.అమెరికాకు వ్యాపార, పర్యాటక, బీ1, బీ2, విద్యార్థి వీసాలకు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘ సమయం వేచి ఉండాల్సిన వస్తుందన్న విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా వీసా అప్లై చేసుకుంటే ఏండ్ల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. అయితే ఏజెంట్లను డబ్బు చెల్లిస్తే కేవలం నెల రోజుల్లోనే అపాయింట్‌మెంట్లు దొరుకుతాయి. ఇది చాలా కాలంగా జరుగుతున్నదే. ఏజెంట్లు కొన్నిరకాల ప్రత్యేకమైన బాట్స్‌ను ఉపయోగించి అపాయింట్‌మెంట్ స్లాట్లను బ్లాక్ చేస్తుంటారు. దీంతో వ్యక్తిగతంగా వీసాలకు అపాయింట్‌మెంట్లు చేసుకున్న వారు కూడా సుదీర్ఘ కాలం వేచి ఉండలేక ఏజెంట్లకు డబ్బులు చెల్లించి ఈ తరహాలో అపాయింట్‌మెంట్లు పొందుతుంటారు. దీని కోసం ఒక్కో వీసా దరఖాస్తుకి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ ఏజెంట్లు వసూలు చేస్తుంటారు.కాగా, 2023-24 (అక్టోబర్ 2023 ? సెప్టెంబర్ 2024) ఆర్థిక సంవత్సరంలో జూ ఈ-1 విద్యార్థి వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. వాటిలో 2.79 లక్షలు (41 శాతం) తిరస్కరించబడ్డాయి. గతేడాది 6.99 లక్షల దరఖాస్తులు రాగా 36 శాతం తిరస్కరణకు గురయ్యాయి. ఇక 2014లో వీసాల తిరస్కరణ రేటు 15 శాతంగా ఉండేది. ఇప్పుడు అది దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఈ కారణంగా యూఎస్ యూనివర్సిటీల్లో చదువాలనుకునే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపింది.

## బల్లులు తిరిగే బాత్రూంలో 16 రోజులు టార్చర్ అనుభవించా..

# అసెంబ్లీలో సీఎం రేవంత్ ఎమోషనల్

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీ లో సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తాను కక్షసాధింపు చర్యలకు పాల్పడే వ్యక్తిని కాదని అన్నారు. తనది అలాంటి స్వభావమే అయితే ఇవాళ పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పారు. గతంలో తనను ఎంతో ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. 16 రోజుల పాటు జైలులో పెట్టారు. బల్లులు తిరిగే బాత్రూంలో బంధించారు. కూతురి పెళ్లికి కూడా రానీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు.. ఢిల్లీ నుంచి లాయర్లను తీసుకొచ్చారని ఎమోషనల్ అయ్యారు. సొంత పార్టీ ఆఫీస్లో, సొంత పార్టీ నేతలతోనూ తనను తిట్టించారని అన్నారు. రివేంజ్ తీసుకోవాలనుకుంటే ఎంతో సమయం పట్టదని.. వాటి మీద నేను దృష్టి పెట్టుంటే ఇవాళ వాళ్లంతా జైలులో ఉండేవారని అన్నారు. నన్ను వేధించిన వారిని ఆ దేవుడే ఆస్పత్రి పాలు చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. కానీ తాము అలా చేయడం లేదు.. అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు అంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. రైతుభరోసా ఇచ్చాం, రుణమాఫీ చేశాం, 57 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం, మహిళలకు ఆర్టీసీల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చాం... ఇలా చెప్పుకుంటే పోతే ఏడాదిన్నలోనే అనేక పనులు చేశామని అన్నారు. బీఆర్ఎస్ నేతల మాదిరి దోచుకో.. దాచుకో అనేది తమ సిద్ధాంతం కాదని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే అని రైతులను కేసీఆర్ అనేక రకాలుగా వేధించారు.. ఆయన ఫామ్ హౌజ్లో మాత్రం వరి పండించారని అన్నారు..

## ప్రయాణం మరింత సురక్షితం

**రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు పోలీసుల ప్రత్యేక చర్య**



**జగిత్యాల, పెన్ పవర్::**జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సురక్షిత ప్రయాణం" అనే కార్యక్రమం లో భాగంగా కొండగట్టు ఘాట్ రోడ్డు నుండి వాహనాలు కిందకు వచ్చి నేషనల్ హైవే -63 ని కలిసే వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నందున మల్యాల సి.ఐ రవి,ఎస్.ఐ నరేష్ ఆధ్వర్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రెండు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు...ఈ చర్య వల్ల అధిక వేగంతో వస్తున్న వాహనాలు నియంత్రణలోకి వచ్చి ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదల నివారణలో ప్రజలు కూడా భాగస్వాములై ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదలను నివారిచడం లో కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి పోలీసులు తీసుకున్న చొరవను స్థానిక ప్రజలు అభినందించారు.

## పదవ తరగతి పరీక్ష పత్రం లీక్ కేసులో ఆరుగురు అరెస్టు మరో ఇద్దరు పరారీ

**కామారెడ్డి పెన్ పవర్::** పదో తరగతి పరీక్షల్లో ప్రశ్నల లీకేజీ పై దర్యాప్తు వేగవంతం చేసారు. జుక్కల్ జెడ్పి హై స్కూల్ ఘటనపై పోలీసుల సీరియస్ అయ్యారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లడుతూ తొమ్మిది మంది పై కేసు నమోదు అయింది. ఆరుగురు అరెస్ట్ అయ్యారు. పరారీ లో మరో ముగ్గురు వున్నారు. సోషల్ మీడియా లో ప్రశ్నలను ఇద్దరు యూట్యూబర్లు వైరల్ చేసారని అన్నారు.

## భవనం కూలిన ఘటన మృతుల బంధువుల అందోళన

**భద్రాచలం పెన్ పవర్::** భద్రాచలంలో భవనం కూలిన ఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. మృతులు ఉపేందర్, చల్లా కామేష్గా గుర్తించారుర. శిథిలాల కింద ఉపేందర్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని బయటకు తీసేందుకు రెస్క్యూటీమ్ యత్నం చేసింది. భద్రాచలంలో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళనకు దిగారు. బ్రిడ్జి సెంటర్లో రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. పోలీసులతో వాగ్వాదం జరగడంతో పలువురిని అరెస్ట్ చేసారు. ..

## ట్యాంకర్, లారీ ఢీ? ఒకరు మృతి

**జనగామ పెన్ పవర్:** స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్లులో రోడ్డు ప్రమాదం జరిగింది. వాటర్ ట్యాంకర్ ను ఇసుక లారీ ఢీకొట్టింది. ఘటనలో మొక్కలకు నీళ్లు పోస్తున్న వాచర్ బండ హరీష్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ బెజ్జం రమేష్ (35) కు స్వల్ప గాయాలు అయ్యాయి. జాతీయ రహదారిపై చెట్లకు నీళ్లు పోసేందుకు వాటర్ ట్యాంకర్ వచ్చింది. లారీ కి వాటర్ ట్యాంకర్ కి మధ్యలో వాటర మృతదేహం ఇరుక్కుంది. ట్యాంకర్ రోడ్డు మద్యలో వుండడమే ప్రమాదానికి కారణం. మృతుడు మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు.

# సెర్ఫ్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదటమైన చర్యలు తీసుకోవాల

**హైదరాబాద్ పెన్ పవర్:**గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్ ల తో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకెపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకెపి లకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమిషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమిషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు.

దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు.నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్దులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.3 నెలలు ఫించన్ తీసుకోని లబ్దిదారులు వలస వెళ్లినట్లు సిస్టమ్ నమోదు చేస్తుందని అన్నారు. వలస వెళ్లినట్లు నమోదు అయిన వివరాలను అధికారులు పరిశీలన చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు. స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పరిశీలన చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్టిచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారులకు తెలిపారు. మహిళలచే చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హోటల్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు, వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ భీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అందజేయాలని అన్నారు

# హెచ్ సీయూ దగ్గర వేలం ఆపండి

**హైదరాబాద్ పెన్ పవర్:**




హెచ్‌సీయూ వద్ద ప్రభుత్వానికి దక్కిన 400 ఎకరాల భూమిపై వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం దీనిపై క్లారిటీ ఇచ్చినప్పటికీ ప్రతిపక్షాలు మాత్రం నిర్ణయం పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా ముక్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. ఈ భూములను వేలం వేయొద్దని సూచించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూముల వేలాన్ని విరమించుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. గతంలో ప్రభుత్వ భూముల విక్రయాన్ని రేవంత్ రెడ్డి వ్యతిరేకించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆర్థిక వనరుల సమీకరణ కోసం కంచ గచ్చిబౌలి గ్రామంలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందన్నారు కిషన్ రెడ్డి. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న టైంలో ప్రభుత్వ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేస్తున్నాని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అమ్మితే భవిష్యత్ తరాలకు నష్టం చేసినట్టు అవుతుందని ప్రజలకు ఏమైనా చేయాలన్నా భూములు లేకుండా పోతాయని రేవంత్ రెడ్డి చెప్పిన విషయం ప్రస్తావించారు. ఇప్పుడు ప్రభుత్వం వేలం వేయడానికి చూస్తున్న భూమిలో అనేక వృక్షాలు, జంతువులు, సరస్సులు ఉన్నాయని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. 734 వృక్ష జాతులు, 220 పక్షి జాతులు, నెమళ్లు, వలస పక్షులు, జింకలు, అడవి పందులు, కొండ చిలువలు, నక్షత్ర తాబేళ్లు ఉన్నాయని అన్నారు. ఈ భూమి పచ్చని చెట్లతో, వైవిధ్యమైన జీవజాతులతో కూడి ఉందన్నారు. అలాంటి పచ్చని భూమిలో కాంక్రీట్ నిర్మాణాలు చేపడతామని ప్రతిపాదనలు చేయడం ఏంటని నిలదీశారు. ఇక్కడ పర్యావరణానికి ముప్పుకలిగితే అది నగరానికి చేటు అని హెచ్చరించారు. ఒకప్పుడు అడవులు కొండలు ఉండేవని పట్టణీకరణతో ఇప్పుడు కాంక్రీట్ అడవిలాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆర్థిక వనరుల పేరిట పచ్చని భూములను కూడా కాంక్రీట్ జంగిల్స్‌గా మార్చుదాన్ని కిషన్ రెడ్డి తప్పుపట్టారు. హైదరాబాద్‌లో పచ్చదనం తగ్గిపోతోందని భవిష్యత్ తరాల కోసం స్థలాలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వం భూమి అని దీనికి హెచ్‌సీయూకి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రకటించారు. ఈ భూమిలో ఎలాంటి బఫెలో లేక్ , పికాక్ లేక్ లాంటివి లేవని స్పష్టం చేశారు. రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బడ్జెట్ డిస్కషన్ సందర్భంగా ఈ గచ్చిబౌలిలో వివాదాస్పద భూమిపై మాట్లాడారు. అక్కడ ఐటీ, ఇతర పరిశ్రమలు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. అక్కడ రిజర్వ్ ఫారెస్ట్ లేదని జింకలు, పులులు, సింహాలు లేవని తెలిపారు. కానీ అక్కడ కొన్ని గుంట నక్కలు చేరి ఇలా ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. దానిని డెవలప్‌మెంట్‌కు వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. గుట్టుగా ఎవరికీ కట్టబెట్టలేదని ఓపెన్ ఆక్షన్ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. యూనివర్సిటీ పిల్లలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంబంధించి విషయాల్లో భూసేకరణ చేస్తే అడ్డంకులు సృష్టించొద్దని సూచించారు.